క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు



బస్సు డిక్కీలో సోదాలు చేస్తున్న పోలీసులు

భామిని: ఒడిశా–ఆంధ్ర సరిహద్దులో వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం బత్తిలిలో ఎస్‌ఐ జి.అప్పారావు తన సిబ్బందితో కలిసి ఒడిశా నుంచి వచ్చిపోయే వాహనాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గంజాయి, సారా, మద్యం, ఖైనీ వంటి మత్తు పదార్థాల రవాణా ఏమైనా జరుగుతుందా అనేకోణంలో తనిఖీ లు చేపడుతున్నారు. నిబంధనలు అతిక్రమి స్తూ వాహనాలు నడుపుతున్న వారికి హెచ్చరించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి



వైద్యారోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి తిరుమలప్రసాద్

గరుగుబిల్లి: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తిరుమలప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం జరిగిన పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రిజం 10పై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. అలాగే ఈ నెల 12వ తేదీన డీవార్మింగ్ డే..కు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వయసులోపు వారంతా నులిపురుగు నివారణ మాత్రలు వేసుకునేలా చూడాలన్నారు.జగదీశ్వరి, ఉదయకుమారి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి వెండి సామగ్రి బహూకరణ




స్వామి వారికి వెండి వస్తువులు బహూకరిస్తున్న దాతలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఎన్‌ఆర్‌ఐ ఓలేటి గౌరునాయుడు, దాత్రి దంపతులు వెండి సామగ్రి శనివారం బహూకరించారు. హారతి స్టాండ్, పంచపాత్ర, ప్లేటు, శఠగోపం, ఉద్ధరిణి తదితర వస్తువులను దాతలు అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి కొత్త జట్టు ఆశ్రమంలో ఎన్‌ఆర్‌ఐ ఓలేటి గౌరునాయుడు, దాత్రి దంపతులు ఇచ్చిన రూ.లక్షన్నర విరాళంతో ఏర్పాటు చేసిన ఆదితల్లి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సినీగేయ రచయిత టి.శివాజీ, జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు పారినాయుడు, జట్టు డైరెక్టర్ ప్రహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా అండర్ గ్రౌండ్ రోడ్డు పనులు



చినబోగిలి కాలనీ వద్ద జరుగుతున్న అండర్ గ్రౌండ్ రోడ్డు పనులు

సీతానగరం: సీతానగరం – చినబోగిలి రైల్వే లైన్ కింద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులు పూర్తి కావడంతో ఇరువైపులా అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నుంచి జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకు చేపట్టిన రహదారి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం సీతానగరం సువర్ణముఖీ నదికి సమీపంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రైల్వే లైన్ కింద బాగాన లైట్ వెయిట్ వాహనాల రాకపోకలు నిర్వహించడానికి బ్రిడ్జి నిర్మాణం చేశారు. మరోవైపు కాశీపేట – ఆర్.వెంకంపేట గ్రామాల మధ్య అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు.

చోడి సాగు బాగు!



ఏజెన్సీలో పండిస్తున్న చోడి పంట(ఫైల్)

- చోడి పంట పండించడంపై రైతుల ఆసక్తి
- డిమాండ్, ధర బాగుండడంతో సాగుపై మక్కువ
- జిల్లాలో పాలకొండ డివిజన్‌లో అత్యధికంగా సాగు

భామిని:

చోడి(రాగులు) పంట సాగు విస్తారంగా జరుగుతోంది. మంచి డిమాండ్, ధర ఉండడంతో రైతులంతా ఈ పంట పండించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా రెండు వేల ఎకరాల్లో పంట సాగుకు సిద్ధపడుతుండగా, పాలకొండ డివిజన్‌లో అత్యధికంగా సాగు జరుగుతోంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వచ్చే ఈ పంటను ఈ ఏడాది కూడా సాగు చేసేందుకు పలువురు కొత్త రైతులు మక్కువ కనబరుస్తున్న వేళ.. పంటను ఏ విధంగా వేసుకోవాలి..ఎలా సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్న అంశాలపై కథనం..

నీరు నిల్వ నేలలు మినహా..

నీరు నిల్వ ఉండే నేలలు మినహా మిగతా అన్ని రకాల నేలల్లోనూ చోడి పంట వేసుకోవచ్చు. నాలుగు సెంట్ల విస్తీర్ణంలో రెండు కిలోల విత్తనాలతో పెంచిన చోడి నారు ఎకరం పొలానికి సరిపోతుంది. అదే వెదజల్లే పద్ధతి అయితే ఎకరానికి నాలుగు కిలోల విత్తనాలు అవసరం. విత్తనాలు వేసుకునే ముందు కిలో విత్తనాలకు 2 గ్రాముల కార్బండిజమ్ లేదా 3 గ్రాముల మాంకోజెట్ కలిపి శుద్ధి చేసుకోవాలి. 25 రోజుల లేతనారు సాళ్ల మధ్య 15 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల దూరం ఉండేలా నాటుకోవాలి. ఎకరా పంటకు నాలుగు టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. ఎకరానికి 12 కిలోల భాస్వరం, 20 కిలోల యూరియా, 20 కిలోల పోటాష్‌ను నారు నాటే సమయంలో వేసుకోవాలి. నాటిన 30 రోజుల తర్వాత మరోసారి ఎకరానికి 25 కిలోల యూరియా వేయాలి. పంటలో ప్రతి 8 వరుసలకు ఒకటి, రెండు వరుసల కందిని అంతర పంటగా వేసుకుంటే అదనపు ఆదాయం వస్తుంది.

దిగుబడులిచ్చే విత్తన రకాలివే..

ప్రస్తుతం అధిక దిగుబడులు ఇచ్చే చోడి విత్తనాల రకాలు అందుబాటులో చాలా ఉన్నాయి. ముఖ్యంగా సాగు చేసేవారు వకుళ, సప్తగిరి, కళ్యాణి వంటి తెల్లరకం గింజలను ఎంపిక చేసుకోవాలి. 100 నుంచి 115 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరానికి సగటున ఐదారు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మిశ్రమ పంటగా కూడా సాగు చేయవచ్చు. కొండ ప్రాంతాల్లో నీరు నిల్వని ప్రాంతాల్లో దీనిని సాగు చేసుకోవచ్చు.

బలవర్ధకమైన ఆహారం..

చోడిపిండి అన్ని రకాల వయసుల వారికి బలవర్ధకమైన ఆహారం. ఇంతటి విశిష్టత కలిగిన ఈ పంటలో ప్రోటీన్లు, కాల్షియం, ఇనుము, మెగ్నీషియం అధికంగా ఉండడం వల్ల ఇది ఆరోగ్యానికి మేలు చేకూరుస్తుంది. పీచు పదార్థాలు, విటమిన్లు, జింక్, ఫోలిక్‌యాసిడ్, పాస్ఫరస్‌లు తగిన మోతాదులో ఉంటాయి. చోడి పిండిని రాగి సంకటి, అంబలి, తోప, రొట్టెలు, జావ, బిస్కెట్లు, అట్టులాగా చేసుకుని, తింటే మెరుగైన ఆరోగ్యానికి దోహదపడుతుంది.

మార్కెట్‌లో మంచి డిమాండ్..



ప్రతి ఇంట్లో చోడిపిండితో చేసే వంటకాలు, పదార్థాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈ పంట సాగుకు అందరూ ముందుకు వస్తున్నారు. తక్కువ పెట్టుబడితో తక్కువ రోజుల్లో అధిక దిగుబడి రావడంతో ఈ పంట వేసేందుకు రైతులు ఆసక్తి చూపిస్తుండడం శుభపరిణామం. -కె.రత్నకుమారి, ఏడీఏ, పాలకొండ

మోసం చంద్రబాబు నైజం



సీతంపేట: ఇంటింటికీ వెళ్లి, కూటమి మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట:

మోసం చేయడం చంద్రబాబు నైజమని, ప్రతి ఎన్నికలప్పుడు ఆయన ఇలానే ప్రజలతో ఓట్లు వేయించుకుని వారికిచ్చిన హామీలు అమలు చేయకుండా వంచిస్తారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముత్యాలు గ్రామంలో శనివారం పర్యటించిన ఆమెకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె ఏడాది కాలంగా ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా కూటమి సర్కారు చేస్తున్న మోసాలను వివరించారు. ఎన్నికల సమయంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి ప్రజలకు లెక్కలేనన్ని హామీలిచ్చి, ఓట్లు వేయించుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చాక హామీలేవీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే ఎన్నికల హామీలన్నీ అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అంతేకాకుండా ప్రతి వర్గానికి మేలు చేకూరుస్తూ కుల, మత, రాజకీయ, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందివ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం మాత్రం తమకు నచ్చిన వారికే పథకాలు, కాంట్రాక్టులు ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు ఇచ్చిన రెండు, మూడు పథకాల్లోనూ ప్రజలను మోసం చేశారన్నారు.

మిగతా హామీల అమలెప్పుడు?

ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఏడాదికి మూడు సిలిండర్లు మాత్రమే ఇస్తున్నారని, చాలామంది ఖాతాల్లో ఆ డబ్బులు కూడా పడడం లేదన్నారు. తల్లికి వందనం పథకం కూడా ఒక్కో పిల్లవానికి రూ.15 వేలు అని చెప్పి రూ.13 వేలు ఇచ్చారని, ఈ డబ్బులు వేయడంలోనూ తేడాలున్నాయన్నారు. ఒకరికి రూ.13 వేలు పడితే మరొకరి ఖాతాలో రూ.10 వేలు, ఇంకొకరికి రూ.8 వేలు ఇలా పడ్డాయన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కూడా చాలామంది అర్హులైన రైతులకు అందలేదని దుయ్యబట్టారు. ఇలా ఎన్నికలప్పుడు చెప్పిన దానికి ఇప్పుడు ఇచ్చిన దానికి పొంతన లేకపోవడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. మహిళలకు ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ వంటి హామీలు ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేయాల్సిందేనని, అప్పటివరకు ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ మోహన్‌రావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ ఎస్.కాంతారావు, ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్, హరిప్రసాద్, సర్పంచ్ గణేష్, నాయకులు ఎస్.రాము, ఎస్.మహేష్, జి.సుమిత్రారావు, ఎన్.కృష్ణ, వెంకి, నాగరాజు, ఎస్.మహేష్, ఎస్.అబ్బాస్, ఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పాలకొండ: మండలంలోని అంపిలి గ్రామ సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు తల్లి అన్నపూర్ణమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఆ సర్పంచ్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం కలిసి పరామర్శించారు. ఆమె మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని వేడుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాశరావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కిల్లారి మోహనరావు, మాజీ సర్పంచ్‌లు చింత సంగన్నాయుడు, బూరాడ తేజేశ్వరరావు తదితరులు ఉన్నారు.



పాలకొండ: అన్నపూర్ణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

కొమరాడ: మండలంలోని గుణదతీలేస్ పంచాయతీ, కొరిశీల గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఇటీవల కొమరాడ కేజీబీవీ మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఆ గ్రామానికి శనివారం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబాలను ఓదార్చారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్‌రావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు తదితరులు ఉన్నారు. అలాగే కురుపాం ఎంపీటీసీ సభ్యులు గౌడు సంతోషి తండ్రి భాస్కరరావు ఇటీవల మృతి చెందగా, అక్కడకు వెళ్లి, ఎంపీటీసీని పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, సర్పంచ్ గార్ల సుజాత ఉన్నారు.



కొమరాడ: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని అర్నాడ పంచాయతీ, తుమ్మిగూడ వైఎస్సార్‌సీపీ కార్యకర్త అడ్డాకుల గణపతి ఇటీవల మరణించగా, ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి శనివారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అతడి మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు, సీనియర్ నాయకుడు ఆర్నిపల్లి, చంద్రశేఖర్, ఎంపీటీసీ శంకరరావు, సర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండగ



పాలకొండ పట్టణంలోని పాలవలస నివాసంలో తమ్ముడు ఎమ్మెల్సీ విక్రాంత్‌కు రాఖీ కడుతున్న అక్క,మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వాడవాడలా రాఖీ పండగ సందడి నెలకొంది. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకను ఎంతో ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం జరిగిన ఈ ఉత్సవంలో ప్రతి అన్నకు చెల్లి, తమ్ముడికి అక్క రాఖీలు కట్టి, శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చిన్నవారు పెద్దవారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం స్వీట్లు తినిపించుకుని ఇంటిల్లపాది ఆనందంగా గడిపారు. -పాలకొండ

గిరిజన హక్కుల కోసం పోరాడాలి



ఆదివాసీ తల్లి చిత్రపటం వద్ద గ్రామస్తులతో మాజీ ఎమ్మెల్యే కళావతి

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: గిరిజన హక్కుల కోసం ఐక్యంగా(కలసిమెలసి) పోరాడాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. మండలంలోని ముత్యాలు గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె..ఆదివాసీ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతర విద్యార్థులకు పెన్నులు, నోటుపుస్తకాలు పంపిణీ చేసి, మాట్లాడారు. గిరిజన ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలు ఎన్నటికీ మరువరాదన్నారు. వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని సమస్యలపై మనమంతా ఐక్యమత్యంతో ఉండి పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కొండశిఖర గ్రామాలతో పాటు కొండ దిగువన ఉన్న అనేక గిరిజన గ్రామాల్లోని ప్రజలు మౌలిక సదుపాయాలు లేక సతమతమవుతున్నారని, వారంతా సౌకర్యాలు పొందేలా గిరిజన సంఘాలు కృషి చేయాలన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకుని మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి. ఆదినారాయణ, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ మోహన్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ కాంతారావు, సర్పంచ్ గణేష్, ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్, హరిప్రసాద్, నాయకులు ఎస్.రాము, ఎన్.కృష్ణ, నాగరాజు, వెంకి, ఎస్.మహేష్, ఎస్.అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వంట విధానం వద్దు

గుమ్మలక్ష్మీపురం: మధ్యాహ్న భోజన పథకంలో తీసుకువస్తామంటున్న సామూహిక వంట విధానం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.వి. రమణ డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల మండల మహాసభ శనివారం నిర్వహించారు. మండలం మొత్తం పాఠశాలలకు ఒకేచోట వంట చేసి వంటకాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని, ఇది ఎంతమాత్రం సరికాదని ఆయన ఖండించారు. గత 20 ఏళ్లుగా ఇదే పని చేస్తున్న వారికి రూ.3 వేలు ఇస్తూ శ్రమదోపిడీ చేస్తోందని ప్రభుత్వాన్ని విమర్శించారు. అనంతరం మండల మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం కొత్త కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘ అధ్యక్షులుగా బిడ్డిక సుశీల, కార్యదర్శిగా బి.మాలతి ఉపాధ్యక్షులుగా హేమలత, ఉషారాణి, సహాయ కార్యదర్శులుగా భారతి, తేజోవతి, కోశాధికారిగా కమలమ్మ తదితరులు ఎంపికయ్యారు.

66 గ్రామాలకు తాగునీటి సరఫరా బంద్

పార్వతీపురం రూరల్: మండలంలోని 66 గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే ప్రాజెక్టు సిబ్బంది జీతాల కోసం సమ్మె చేస్తుండడంతో ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ నెల 6న మక్కువ మండలం డి.శిర్లాంలోని పంపుహౌస్ వద్ద విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడి సరఫరా మొరాయించింది. దీంతో తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడడంతో సిబ్బంది వెంటనే మరమ్మతులు నిర్వహించి సమస్యను పరిష్కరించారు. అయితే జనవరి నెల నుంచి వారికి జీతాల బకాయిలు నిలిచిపోవడంతో తమ జీవనం సాగించేందుకు కష్టమవుతుందని, తమ జీతాల బకాయిలు చెల్లిస్తే విధులకు హాజరవుతామని గ్రామీణ నీటి సరఫరా ఏఈ వద్ద సిబ్బంది విన్నవించారు. ఈ మేరకు జీతాలు చెల్లించే ఏజెన్సీతో అధికారులు మాట్లాడగా కేవలం రెండు నెలలకే ఈ వారంలో జీతాలు చెల్లిస్తామని చెప్పడంతో నిరాశకు గురై 66 గ్రామాలకు నీటి సరఫరా చేసే 23మంది ఆపరేటర్లు ఐదు నెలలు బకాయిలైనా చెల్లించాలని కోరారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణే లక్ష్యం

సీతానగరం: మండలంలోని గర్భిణులందరికీ రక్తహీనత నివారణే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని మండల పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉషారాణి అన్నారు. పీహెచ్‌సీలో గర్భిణులకు శనివారం ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఏఎన్‌ఎంలు గుర్తించిన గర్భిణులకు క్షేత్ర స్థాయిలోనే వైద్య పరీక్షలు నిర్వహించి పోషకాలతో కూడిన మందులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, స్టాఫ్‌నర్సు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గణపయ్యలు సిద్ధం..



భామిని: సింగిడిలో రోడ్డులో భారీ గణపతుల ప్రతిమలు

భామిని/గరుగుబిల్లి: వినాయక చవితి ఉత్సవాలకు గణపయ్య విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ప్రతి ఊరిలో ఏటా ఘనంగా నిర్వహించుకునే ఈ పండగను ఒకరిని మించి మరొకరు ఎంతో గొప్పగా చేసుకునేందుకు పోటీపడుతుంటారు. భారీ విగ్రహాల కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తారు. ఎవరెంత ఎక్కువ ఎత్తు విగ్రహం పెడితే వారు అంత బాగా వేడుకలు చేస్తున్నట్లుగా అంతా భావిస్తారు. ఈ నెల 27న గణేశుని నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో గణేశుని విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి. రూ.500 నుంచి రూ.20 వేల ఖరీదైన విగ్రహాలు అందుబాటులో ఉండగా, వాటి కొనుగోళ్లకు ఇప్పటి నుంచే ఆసక్తి కనబరుస్తున్నారు.



గరుగుబిల్లిలో విక్రయానికి సిద్ధం చేసిన గణేశుని విగ్రహాలు

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం





గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేటలో ర్యాలీలో జై ఆదివాసీ అని నినాదాలు చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు, గిరిజన డప్పువాయిద్యాల ప్రదర్శన సందడి



కొమరాడ: ర్యాలీ చేస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీ ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల హక్కులు, ఐక్యత చాటుతూ వైటీసీ నుంచి భద్రగిరి, ఎల్విన్‌పేట గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం వైటీసీలో జరిగిన ఈ వేడుకలో పలువురు గిరిజన విద్యార్థులు, యువతీయువకులు గిరిజన సంప్రదాయ వస్త్రధారణలో చేసిన నృత్యాలు అలరించాయి. అలాగే గిరిజన సంప్రదాయ డప్పువాయిద్యాల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది.

కొమరాడ: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని, స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణం నుంచి మండల గిరిజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, గిరిజనుల సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.